# భక్తిమత్తు

మన దేశములో ఉన్న బ్లాక్ మనీలా ,నల్లని నాగు బాములా మెలికలు తిరిగి నేషనల్ హై వే రోడ్ చీకట్లో భయము గొలుపుతుంది. ఆ రోడ్ పై ఒక అల్ట్రా మాడర్న్ కారు అతి వేగముతో దూసుకుపోతుంది. అమావాస్య,అర్ధరాత్రి చీకట్లను చేదిస్తూ కారు దూసుకుపోతుంటే సన్నని చినుకులు ప్రారంభమయ్యాయి.

కారులో చమన్ లాల్, వర్ధన్ రెడ్డి, నరసింహము, రాజన్నలు ప్రయాణము చేస్తున్నారు.

చమన్ లాల్ తన లావుపాటి పొట్టను వేసుకొని వెనుక సీట్లో కూర్చున్నాడు. రాజన్న కారు నడుపుతున్నాడు.

చమన్ లాల్ వడ్డీ వ్యాపారి. వడ్డీలపై వడ్డీలు గుంజి ,అవసరార్ధము అప్పు చేసిన వారి రక్తాన్ని రూపాయిలుగా మార్చి,ఇంట్లో ఇనుప పెట్టెను నింపాడు.చంచలమైన లక్ష్మీ దేవికి నల్లముసుగు వేసి జాగ్రత్తగా కాపాడుకుంటున్నాడు. అతడి దగ్గర ఉన్న ప్రతి రూపాయి వెనుక ఒక ఆర్తనాదము,ఒక విషాద గాధ ఉంది.

వర్ధన్ రెడ్డి బార్ అండ్ రెస్టారెంట్ యజమాని ప్రభుత్వ పెద్దల బలముతో,రౌడీల బలగముతో,ప్రజల బలహీనతతో తన వ్యాపారాన్ని మూడు క్రయిట్లు ఆరు బ్యారెల్లు గా వృద్ధి చేసాడు. లోలోపల యువతకు నార్కోటిక్ డ్రగ్స్ సరఫరా చేస్తుంటాడు.

నరసింహము చిట్ ఫండ్ వ్యాపారస్తుడు. రోజు ఒక కొత్త పేరుతో,సంస్థలు ప్రారంబించడము, భారీ రాబడులు ఆశగా చూపి డిపాజిట్లు సేకరించడము ,స్కీములు ,బహుమతులు ఎరగా వేయడము ,చివరికి ప్రజలనెత్తిపై శఠగోపము పెట్టి ఉడాయించడము,ఫోలీసుల,పొలిటేషన్ల అండతో బయటపడటము అతడికి ఇనప్పెట్టెతో పెట్టిన విద్య.

రాజన్నది సూపర్ మార్కెట్ .షో కేస్ లో అర్ధ రూపాయి పెట్టి రూపాయికి అమ్మగల వాడు. అందమైన అమ్మాయిలను సేల్స్ గర్ల్స్ గా పెట్టుకొని వారి చేత నయాన,భయాన పడుపు వృత్తి చేయిస్తుంటాడు.

అందరూ ఘటికులే,నటకులే. ఘనాధనికులే.

వీరిని దగ్గరికి చేర్చింది. వారి దగ్గర ఉన్న డబ్బు. సంఘములో వారికి ఉన్న పలుకుబడి అయినా వారిని మరింత సన్నిహితులను చేసింది మాత్రము మందే.

అంటే వారు మందు మిత్రులు.

అయితే వారందరికీ తెలుసు లోలోపల తాము చేస్తున్నవి పాపాలని,తాము పాపులమని.

అందుకే ఆ నలుగురు తమ పాపాన్ని కడుక్కోవడానికి ,నెలకొకసారి నగరానికి వందకిలో మీటర్ల దూరములోనున్న ఒక దేవుడి కొండ పైకి వెళతారు.

ఇపుడు కూడా ప్రస్తుతము వారు అక్కడికి వెళుతునారు. వారు అప్పటికే బాగా త్రాగి ఉన్నారు.

“నిజంగా భగవంతుడు ఎంత గొప్ప వాడయ్యా! అక్కడెక్కడో సంవత్సరానికి ఆరు నెలలు మాత్రమే ఆలయము తెరిచి ఉంచుతారట,మిగతాఆరునెలలు మూసేస్తారట.ఒకసారి యేమి గజరిగిందో తెలుసా? ఒక పిల్లవాడు గుడిలో చిక్కుకుపోయాడట. అది తెలియక గుడి తలుపులు మూసివేశారట. తిరిగి ఆరునెలల తరువాత గుడి తలుపులు తెరిచి చూస్తే ,పిల్లవాడు చెక్కుచెదరకుండా బయటపడ్డాడట. ప్రతిరోజు ఆపిల్లవాడికి దేవుడు ముసలివాడి రూపములో వచ్చి,పండ్లూ ఫలహారాలు ఇచ్చిపోయేవాడట. ఎంత అద్భుతము”అన్నాడు రెడ్డి.

రక్తములో చేరిన ఆల్కహాల్ తోనో, భక్తితోనో కళ్ళు మూస్తూ.
అంతెందుకు పోయిన నెల నా కుటుంబముతో సహా తిరుపతికి కారులో పోతున్నాను.ఘాట్ రోడ్ పై కార్ బ్రేక్ ఫెయిలయింది.
"బాలాజీ బచావ్" అన్నాను. అంతే వెంటనే కార్ సేఫ్ గా ఆగిపోయింది'అన్నాడు మత్తుగా చమన్ లాల్.
కార్ తారు రోడ్ వదిలి కచ్చా రోడ్ పైకి ఎక్కింది. వర్షము మరింత ఉధృతమైంది. అంతకు ముందు రెండు రోజుల నుండి కూడా వర్షాలు కురుస్తుండడముతో చుట్టు పక్కలా మరియు రోడ్పైన పెద్ద,పెద్ద గుంతలు పడి నీళ్ళు నిండాయి.
కారు ఒక చెరువు సమీపానికి వచ్చి ,ఒక పెద్ద కల్వర్ట్ దగ్గర ఉన్న ట్టుండి ఆగిపోయింది.
చెరువుకు గండి పడినట్టుంది.పైగా దగ్గరలో నున్న డామ్ నుండి నీళ్ళు కూడా వదిలినట్టున్నారు. నీరు రోడ్ పైకి ప్రవహిస్తుంది. రోడ్ పై రెండు మూడు అడుగులు నీళ్ళు పారుతున్నాయి. నీళ్ళ ప్రవాహము క్రమంగా పెరిగి కారును సగము వరకు ముంచివేసాయి.
మందు చతుష్టయములోని ముగ్గురు దిగి కారును నెట్టే ప్రయత్నము చేస్తున్నారు.
చుట్టూ చీకటి_______ నీళ్ళూ_____ మనసులో భయములా పెరగసాగాయి.
ఇంతలో నీటి ప్రవాహానికి కొట్టుకు వచ్చిన దుంగలతో కారు హెడ్ లైట్లు పగిలిపోయాయి. వెనుక లైట్లు పని చేయడము లేదు. నీటి ప్రవాహము నడుము లోతు దాటింది. దాటాల్సిన దూరము కనీసము రెండు వందల అడుగులు ఉంది.
కారు వదిలి నడిచి వెళ్ళితే, ఎంత ఈత వచ్చినా నీటిలో కొట్టుకు పోవడము ఖాయముగా తోచింది వారికి. కారుతో కుస్తీ పడలేక,బిక్కు బిక్కుమంటూ ,ఇక తమకు జల సమాధి తప్పదనుకుంటూ భయపడ సాగారు.
ఇంతలో ఒక యువకుడు ఆ నీటిలో ,ఆ వేళలో అటువైపు జాగ్రత్తగా నడుస్తూ ,వారి వైపువచ్చాడు. బలంగా ఉన్నాడు . కానీ రెండు మూడు రోజుల నుండి ఏమి తినట్లుంది అతడి వాలకము.ముఖము చాలా నీరసపడిపోయిఉంది.
"ఏదైనా పని దొరకబుచ్చుకొని పొట్ట నింపుకుందా"మనుకున్నట్లుగా ఉన్నాడు.
ఆ నలుగురికి అతడిని చూడగానే ఒక్క సారిగా ఉత్సాహము వచ్చింది. వారు అతడితో యేదో మాట్లాడారు. అతడు యేమీ మాట్లాడలేదు. ఎందుకంటే అతడు చెవిటి,మూగవాడు కాబట్టి. కానీ పరిస్థితిని అర్ధము చేసుకున్నాడు.
వారి భుజము తట్టాడు. ఒక్కడి వల్ల ఏమి అవుతుంది. తాము కూడా ఒక పట్టు పట్టలన్న ఆలోచన లేకుండా వెళ్ళి కారులో కూర్చున్నారు.
కారు లోపల చిన్న బల్బు మాత్రము వెలుగుతుంది.
ఆ యువకుడు తనకున్న బలాన్ని ,శక్తిని ఉపయోగించి కారును తోయసాగాడు. కొంత శ్రమ పడ్డతరువాత ,రోడ్డు గుంతలో చిక్కుకున్న కారు చక్రాలు ,యువకుడు బలంగా తోయడము వల్ల బయటకు లాగబడి,ఒక్కసారిగా ముందుకు ఉరికాయి. కారు ముందుకు పోయింది.
ఆ మూగవాడు కారును ముందుకు తోస్తూ ,అదే వేగముతో ముందుకు పోబోయాడు. కానీ కాలు జారి నీళ్ళలో పడిపోయాడు. అప్పటి వరకు భుజాల వరకు వచ్చిన నీళ్ళు అతడిని కప్పివేసాయి.
అతడికి రాని "ఈత" ,అతడు బ్రతకడానికి చేసే ప్రయత్నాలు విఫలము చేస్తూ అతడిని పైకి రానీయకుండా చేసింది.

కొంచెము దూరము కారు పోయిన తరువాత ,నీరు కొంచెము తక్కువ ఎత్తులో ప్రవహిస్తున్న చోట కారుస్లో చేసి వెనక్కి చూసారు చతుష్టయము. అతడుకనబడ లేదు.
వారు కారు దిగివెనక్కివెళ్ళి,కృతజ్ఞతలు చెప్పాలన్న ఆలోచన కానీ , “అయ్యో కనబడడము లేదు చూద్దాము” అన్న ప్రయత్నము కానీ చేయలేదు.
వారి దగ్గర ఉన్న కరెన్సీ వారికి  ఆ డీసెన్సీ నేర్పలేదు.
“దేవుడే ఇలా వచ్చి మనకు సహాయము చేసి మాయమైనట్లున్నాడు, గాడ్ ఈజ్ గ్రేట్” అన్నాడు రెడ్డి కారు వేగము పెంచుతూ.
“భగవంతుడి మహిమ అపారము” అంటూ చమన్ లాల్ సీట్లో జారగిలబడ్డాడు.
అంతవరకు చావు  భయముతో కొట్టుమిట్టాడిన చతుష్టయము ఖరీదైన విస్కీ సేవిస్తూ యధావిధిగా సంభాషణల్లోకి మారిపోయారు.
కారు ముందుకు సాగిపోయింది. వాళ్ళనెప్పుడు రక్షించే భగవంతుడిని దర్శించడానికై.
కారులో నుండి వాళ్ళు కొంత దూరము వెనక్కు వచ్చినా,కారు మళ్ళీకారు  ఆగిపోయినా లేదా వారిలో యే కొంత మానవతా స్పర్శ ఉన్నా ఆ యువకుడు తాను బ్రతకాలని చేసే ప్రయత్నము వారికి కనబడేది.
కానీ వంటి నిండా ప్రవహిస్తున్న మందు మత్తు, మనసులో ఉన్న భక్తి మత్తు వారిని వెనక్కి రానీయలేదు.